www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 13 అక్టోబర్ 2025

పోలవరంలో వర్షం

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం మండలంలో ఆదివారం మధ్యాహ్నం ఆకస్మికంగా ఓ మోస్తరు వర్షం కురిసింది. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై గాలి, వాన మొదలైంది. సుమారు అరగంటపాటు కురిసిన వర్షంతో మండలంలో పలు వీధుల్లో రోడ్లపై నీరు నిలిచిపోయింది. ప్రజలు తాత్కాలికంగా దుకాణాలు, చెట్ల కింద ఆశ్రయం పొందారు. ఉదయం నుంచి మండుతున్న ఎండకు ఉక్కిరిబిక్కిరైన ప్రజలు మధ్యాహ్నం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు.

పోలవరంలో కురుస్తున్న వర్షం

'బెల్టు' దుకాణాల్లో మద్యం నాణ్యత ఎంత..!

- ☐ రెండు జిల్లాల్లో వందల సంఖ్యలో బెల్టు దుకాణాలు
- ☐ లూజు మద్యం అమ్మకాలకు బెల్టు దుకాణాలు కేరాఫ్ అడ్రస్
- ☐ కల్తీ మద్యం దందా ఇక్కడే సాగుతున్నా అంగీకరించని ప్రభుత్వం, అధికారులు
- ☐ కల్తీ మద్యం జిల్లాలో లేదని ఎక్సైజ్ అధికారుల ప్రకటనపై పెదవివిరుపు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రాష్ట్రంలో పలుచోట్ల బయటపడిన కల్తీ మద్యం వ్యవహారం ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోనూ హాట్‌టాపిక్‌గా మారింది. కల్తీ మద్యం అమ్మకాలు జిల్లాల్లో ఎక్కడా లేవని ఎక్సైజ్ అధికారులు చెబుతున్న మాటలపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. విచ్చలవిడిగా ఉన్న బెల్టు దుకాణాల్లో జరిగే మద్యం అమ్మకాలపై నాణ్యతను అధికారులు ఏవిధంగా తేలుస్తారని అంతా ప్రశ్నిస్తున్నారు. బెల్టు దుకాణాల్లోనే కల్తీ మద్యం దందా సాగే అవకాశాలు ఉన్నాయనే చర్చ సర్వత్రా నడుస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నూతన మద్యం పాలసీని తీసుకొచ్చింది. టెండర్ల ద్వారా మద్యం దుకాణాలను కేటాయించింది. అధికారికంగా ఏలూరు జిల్లాలో 144, పశ్చిమలో 175 మద్యం దుకాణాలకు ప్రభుత్వం లైసెన్స్ ఇచ్చింది. ప్రభుత్వ లైసెన్స్ పొందిన దుకాణాల్లో 2024 అక్టోబర్ నుంచి మద్యం అమ్మకాలు ప్రారంభమయ్యాయి. అధికారికంగా లైసెన్స్ పొందిన ప్రతి మద్యం దుకాణ పరిధిలో పదుల సంఖ్యలో బెల్టు దుకాణాలు వెలిశాయి. గ్రామంలో ప్రతి ఏరియాకు ఒక బెల్టు దుకాణం ఉందంటే అతిశయోక్తి కాదు. బెల్టు దుకాణాల్లో పూర్తిగా లూజు అమ్మకాలే ఎక్కువగా సాగుతుంటాయి. లైసెన్స్ దుకాణాల నుంచి కొన్ని మద్యం సీసాలు తెచ్చుకుని అధిక ధరలకు విక్రయిస్తారు. ఇవి కాకుండా కల్తీ మద్యం అమ్మకాలు సైతం బెల్టు దుకాణాల్లో సాగిస్తున్నారనే విమర్శలు సైతం ఉన్నాయి. ఎందుకంటే లూజు అమ్మకాలు పెద్దఎత్తున బెల్టు దుకాణాల్లోనే జరుగుతున్న పరిస్థితి ఉంది. కొన్నిచోట్ల బెల్టు దుకాణాల వద్ద సైతం సిట్టింగ్ ఏర్పాటు ఉందంటే ఆశ్చర్యపోక తప్పదు. అన్నమయ్య, ఎన్‌టిఆర్ జిల్లాల్లో కల్తీ మద్యం వ్యవహారం బయటపడటంతో ఉమ్మడి జిల్లాలోనూ అందోళన నెలకొంది. ఏలూరు రూరల్ మండలం పైడిచింతపాడులో కల్తీ మద్యం అమ్ముతున్నారని పెద్దఎత్తున ప్రచారం సైతం సాగింది. ఎక్సైజ్ అధికారులు అక్కడికి వెళ్లి తనిఖీలు నిర్వహించి ఏమీ లేదన్నట్లు చెప్పుకొచ్చారు. బెల్టు దుకాణాలపై ప్రభుత్వంగాని, అధికారులుగాని అధికారికంగా అంగీకరించే పరిస్థితి లేదు. బెల్టు దుకాణాల ద్వారా మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్న విషయం అందరికీ తెలిసిందే. లైసెన్స్ దుకాణాలే కాకుండా బెల్టు దుకాణాలను సైతం కూటమి పార్టీలు టిడిపి, జనసేన సానుభూతిపరులకు సమానంగా కేటాయించారు.

లాభార్జనే

లక్ష్యంగా బెల్టు అమ్మకాలు

బెల్టు దుకాణాల్లో మద్యం అమ్మకాలన్నీ లాభార్జనే లక్ష్యంగా సాగుతున్న పరిస్థితి ఉంది. బెల్టు దుకాణాల్లో జరిగే అమ్మకాలకు సంబంధించి ఎటువంటి లెక్కలూ ఉండవు. ఇక్కడ ఎటువంటి మద్యం అమ్మినా పట్టించుకునేవారే ఉండరు. ఎందుకంటే బెల్టు దుకాణాలు నడుస్తున్నాయనే వాస్తవాన్ని ఎక్సైజ్ అధికారులు అధికారికంగా అంగీకరించే పరిస్థితి లేదు. రెండు జిల్లాల్లో కల్తీ మద్యం వ్యవహారం సాగుతుందనే అనుమానాలు అందరిలోనూ నెలకొన్నాయి. బెల్టు దుకాణాలకు వస్తున్న మద్యంలో అధికంగా కల్తీ మద్యం వచ్చే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. బెల్టు దుకాణాలను అరికట్టకుండా కల్తీ మద్యం లేదని అధికారులు ఏవిధంగా ప్రకటిస్తున్నారో అర్థం కావడం లేదు. గత ప్రభుత్వ హయాంలో కల్తీసారాతో జంగారెడ్డిగూడెంలో 20 మందికిపైగా మరణించారు. అప్పట్లో ఈ ఘటన పెద్దఎత్తున దుమారం రేపింది. అప్పుడు కూడా అధికారులు నాటుసారా అమ్మకాలు లేవన్నట్లు మాట్లాడారు. ఇప్పుడూ అదేవిధంగా కల్తీ మద్యం లేదని ఎక్సైజ్ అధికారులు స్టేట్‌మెంట్లు ఇస్తున్నారు. బెల్టు దుకాణాల్లో జరిగే మద్యం అమ్మకాల్లో నాణ్యతను ఏవిధంగా చెబుతారో అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది. ప్రతినెలా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో రూ.200 కోట్లకుపైగా మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. ఇవి అధికారిక లెక్కలు మాత్రమే. అనధికారికంగా సాగే మద్యం అమ్మకాలు పెద్దఎత్తున ఉన్నాయి. అనధికారికంగా సాగే దందా అంతా కల్తీ మద్యం అనే చర్చ సాగుతోంది. బెల్టు దుకాణాలు సాగినంత కాలం కల్తీ మద్యం దందా సాగే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సెల్ టవర్ వద్దంటూ రజక సంఘం ఆందోళన

రేడియేషన్‌తో కేన్సర్ వస్తుందని భయాందోళన

ఆపకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని స్పష్టం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణ పరిధిలోని తిరువూరు రోడ్డులో ఓ ప్రయివేట్ కమర్షియల్ కాంప్లెక్స్‌పై సెల్ టవర్ నిర్మాణాన్ని అడ్డుకుంటూ స్థానిక పాతపేట రజక సంఘం సభ్యులు ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పాతపేట రజక సంఘం సభ్యులు మాట్లాడుతూ సెల్ టవర్ నిర్మాణంతో చిన్నారులు, వయోవృద్ధులు, మహిళలకు తీవ్ర అనారోగ్యాలు ఏర్పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయమై మున్సిపల్ కమిషనర్, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా సకాలంలో స్పందించలేదన్నారు. ప్రజల క్షేమాన్ని పక్కదారి పట్టిస్తూ సెల్ టవర్ నిర్మాణానికి పూనుకోవడంతో పాతపేట రజక సంఘం సభ్యులు నిర్మాణ పనులను అడ్డుకున్నారు. సెల్ టవర్ నిర్మాణం ఆ ప్రాంతం నుంచి తొలగించి జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సెల్ టవర్ నిర్మాణంతో ఏర్పడే రేడియేషన్ వల్ల కేన్సర్, ఇతర దీర్ఘకాలికమైన వ్యాధులు సంక్రమిస్తాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమీప ప్రాంతాల్లో నివసించే నిరుపేదలు రోజువారి కూలీ చేస్తేనే ఇల్లు గడిచే పరిస్థితి ఉందన్నారు. సెల్‌టవర్ నిర్మాణంతో దీర్ఘకాలిక వ్యాధులు సంభవిస్తే వైద్యం చేయించే ఆర్థిక స్తోమత తమకు లేదని వాపోయారు. సమీపంలో నివసించే ప్రజల అనుమతి లేకుండా సెల్ టవర్ ఎలా నిర్మిస్తారని సూటిగా ప్రశ్నించారు. ఇదే విషయం నూజివీడు పట్టణంలోని సబ్ కలెక్టర్, ఏలూరులోని జిల్లా కలెక్టర్, రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వివరించారు. సెల్ టవర్ పూర్తిగా తొలగించే వరకు తమ ఆందోళన విరమించేది లేదని పాతపేట రజక సంఘం సభ్యులు స్పష్టం చేస్తున్నారు.



ఆందోళన చేస్తున్న రజక సంఘం సభ్యులు

మెడల్స్ సాధించిన దార్విక్

జిల్లా స్థాయిలో దార్విక్ ప్రతిభ

ప్రజాశక్తి - టి.నరసాపురం

పశ్చిమ గోదావరి జిల్లా స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో మండలంలోని శ్రీరామవరం గ్రామానికి చెందిన బాలుడు భీరం దార్విక్ ఉత్తమ ప్రతిభ కనబరిచి రెండు బ్రౌంజ్ మెడల్స్ సాధించినట్లు బాలుని తండ్రి భీరం ప్రతాప్ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాలోని తాడేపల్లిగూడెంలో నాలుగు నుంచి ఆరేళ్ల వయస్సు ఉన్న బాలుర రోలర్ స్కేటింగ్ జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్న దార్విక్ ఉత్తమ ప్రతిభ కనబరిచి మూడో స్థానంలో నిలిచి రెండు పతకాలు సాధించినట్లు తెలిపారు. చిన్న వయసులో మంచి ప్రతిభ కనబరిచి విద్యార్థిని గ్రామస్తులు అభినందించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - ముదినేపల్లి

దాదాపు 26 ఏళ్ల తర్వాత తమ స్నేహితులు, చదువు చెప్పిన గురువులను చూసి పూర్వ విద్యార్థులు మురిసిపోయారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకుంటూ సందడిగా గడిపారు. మండలంలోని బొమ్మినంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 1994–1999 బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థులు తమకు చదువులు నేర్పిన గురువులను సత్కరించారు. గురువులకు జ్ఞాపికలను అందించి శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉన్నత స్థానాలకు ఎదిగిన తమ పూర్వ విద్యార్థులను చూసి గురువులు ఆనందించారు. జీవితంలో ఇంకా ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆశీర్వదించారు. తమపై విద్యార్థుల ప్రేమాభినాలు ఎల్లప్పుడు ఉండాలని కోరుకున్నారు. విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యార్థి దశలో గురువులతో మెలిగిన సందర్భాలను తెలియజేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. కొరగుంటపాలెం గ్రామ సర్పంచి పేరే రామకృష్ణ, యర్రంశెట్టి భరత్ కుమార్, ఎస్.రామాంజనేయులు, అచ్యుత ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో 64 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆట, పాటలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు.

పూర్వ విద్యార్థులు

నత్తనడకన ఎన్‌హెచ్ 165 రోడ్డు విస్తరణ పనులు

ముదినేపల్లి వాసులకు తప్పని తిప్పలు

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

పామర్రు–దిగమర్రు 165 జాతీయ రహదారి విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ పనులను కాంట్రాక్టర్ అస్తవ్యస్తంగా, అడ్డగోలుగా చేపట్టడంతో ఇటు ప్రజలు, అటు వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ పరిస్థితి మండల కేంద్రమైన ముదినేపల్లిలో మరింత దారుణంగా ఉంది. ముదినేపల్లి ప్రధాన సెంటర్లో రోడ్డు విస్తరణ పనులు అత్యంత ప్రమాదకరంగా మారాయి. కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా దుకాణాల ముందు రోడ్డు నిర్మాణం కోసం తవ్వకాలు చేసి పనులు పూర్తి చేయకుండా వదిలేశారు. దీంతో ప్రజలు ప్రమాదాల బారిన పడుతూ క్షతగాత్రులవుతున్నారు.

ముదినేపల్లి సెంటర్లో రోడ్డు నిర్మాణం కోసం దుకాణాల ముందు తవ్వకాలు చేసి మూడు నెలలు దాటినా ఇంకా రోడ్డు నిర్మాణం చేయలేదు. దీంతో వ్యాపారులు బేరాలు లేక గగ్గోలు పెడుతున్నారు. జనం దుకాణానికి వెళ్లాలంటే నాలుగు అడుగులు లోతులో ఉన్న గోతులు దాటుకుని పైకెక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో దుకాణాల వైపు జనం కన్నెత్తి చూసే పరిస్థితి లేదు. కిరాణా, హోటళ్లు, టైర్ల కొట్లు, సెల్‌షాపులు ఒకటేమిటీ అన్ని రకాల వ్యాపారులు అస్తవ్యస్త పనులతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందో, ఎప్పుడు తమ వ్యాపారాలు కొనసాగుతాయోనని ఆందోళన చెందుతున్నారు.

ప్రమాదాలు జోరు

రోడ్డు విస్తరణ పనులు అసంపూర్తిగా, అస్తవ్యస్తంగా చేస్తుండడంతో ప్రజలు, వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడి క్షతగాత్రులుగా మారుతున్నారు. సెంటర్లో రోడ్డుపై కంకర లేచిపోయి ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల పెట్రోల్ బంక్‌లో పనిచేసే యువకులు లారీ కిందపడినా తృటిలో ప్రాణపాయం నుంచి బయటపడ్డారు. వర్షం కురిస్తే సెంటర్ అంతా చిత్తడి, చిత్తడిగా మారి గుంతల్లో నీరు చేరి దారి కనపడక వాహనదారులు నానావస్థలు పడుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు విస్తరణ పనుల కారణంగా ఇళ్ల వద్ద ఉన్న ద్విచక్ర వాహనాలు ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి. ఇళ్ల ముందు డ్రెయినేజీలు కట్టి, రోడ్డు నిర్మాణం కోసం తవ్విన గుంతలు పూడ్చకపోవడంతో ఇళ్ల వద్ద ఉంచిన వాహనాలు బయటికి వచ్చే అవకాశం లేదు. బయట ఉంచిన వాహనాలు ఇళ్ల వద్దకు వెళ్లే మార్గం లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటికి వెళ్లాలంటే కిరాయికి వాహనం కట్టించుకుని వెళ్లాల్సి చూస్తుందని పలువురు వాపోతున్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ముందు తవ్విన గుంతల్లో ఇంకా రోడ్డు నిర్మాణం పూర్తి కాలేదు. దీంతో బ్యాంకుకు వెళ్లేందుకు వృద్ధులు పడుతున్న పాట్లు వర్ణనాతీతం. ఎప్పుడు ఈ రోడ్డు పనులు పూర్తయ్యేనో, తమ కష్టాలు ఎప్పటికి తీరేనో అని అటు వాహనదారులు, ఇటు వ్యాపారులు నిర్వేదం వ్యక్తం చేస్తున్నారు. అసలే అంతంతమాత్రంగా జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులకు తరచూ కురుస్తున్న వర్షాలు ఆటంకం కలిగిస్తున్నాయి. ఫలితంగా తరచూ పనులు నిలిచిపోతున్నాయి.

దుకాణాల ముందు తవ్విన గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

పట్టించుకోని నేషనల్ హైవే అధికారులు

ముదినేపల్లి ప్రధాన సెంటర్లో రోడ్డు విస్తరణ పనులపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఇక్కడ నెలకొన్న ఇబ్బందులపై ఇటు ప్రజలు, అటు వ్యాపారులు అనేకసార్లు నేషనల్ హైవే అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండాపోయింది. నేషనల్ హైవే డిఇకి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నప్పటికీ పట్టించుకోవడం లేదని జనం ఆవేదన చెందుతున్నారు. సదరు కాంట్రాక్టర్ ఇష్టారాజ్యాంగా, అడ్డగోలుగా పనులు చేస్తున్నప్పటికీ ఎన్‌హెచ్ అధికారులు కాంట్రాక్టర్‌పై ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాన సెంటర్లో పనులు మొదలుపెట్టి నాలుగేళ్లు దాటినా పూర్తి కాకపోవడంపై సంబంధిత అధికారులపై జనం ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నేషనల్ హైవే అధికారులు వెంటనే స్పందించి ముదినేపల్లి సెంటర్లో అసంపూర్తిగా ఉన్న రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, అడ్డగోలుగా పనులు చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కల్గిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.

ఉత్తీర్ణత పెంపునకు ప్రత్యేక చర్యలు

ఇంటర్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.యోహాను

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఇంటర్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.యోహాను తెలిపారు. జిల్లాలో ఎన్ని జూనియర్ కళాశాలలు ఉన్నాయి, మెయిన్ పరీక్షలు ఎప్పటి నుంచి జరగనున్నాయి, విద్యాశక్తి జిల్లాలో ఎలా అమలవుతుంది వంటి ప్రశ్నలకు ప్రజాశక్తి ముఖాముఖిలో ఆయన సమాధానాలిచ్చారు.

E-mail ID: rioelr.bie@gmail.com

ప్రశ్న: జిల్లాలో ఏఏ యాజమాన్యాల పరిధిలో మొత్తం ఎన్ని జూనియర్ కళాశాలలు ఉన్నాయి? ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారు?

ఆర్ఐఒ: మొత్తం జిల్లాలో 140 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. అందులో 19 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా, ఒక ఎయిడెడ్, ఆరు సోషల్ వెల్ఫేర్, మూడు ట్రైబల్ వెల్ఫేర్, మూడు కెజిబివి, 26 హైస్కూల్ ప్లస్ ఉండగా 85 ప్రయివేట్ కళాశాలలు ఉన్నాయి. మొత్తం 36 వేల మంది విద్యార్థులు ఉన్నారు. అందులో ప్రభుత్వ కళాశాలల్లో నాలుగు వేల మంది ఉన్నారు.

ప్రశ్న: పబ్లిక్ పరీక్షలు ఎప్పటి నుంచి జరగనున్నాయి?

ఆర్ఐఒ: పబ్లిక్ థియరీ పరీక్షలు ఫిబ్రవరి 23వ తేదీ నుంచి మార్చి 24వ తేదీ వరకు జరగనున్నాయి. అలాగే ఒకేషనల్ ప్రాక్టికల్స్ జనవరి 27 నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు, జనరల్ ప్రాక్టికల్స్ ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి 10వ తేదీ వరకు జరగనున్నాయి. పరీక్షల ఫీజు చెల్లించే గడువు ఇప్పటికే ముగిసింది. అయితే రూ.వెయ్యి పెనాల్టీతో ఈ నెల 21వ తేదీ వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉంది. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు జనవరి 21న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష, జనవరి 23న పర్యావరణంపై పరీక్ష ఉన్నాయి. కచ్చితంగా వీటిలో ఉత్తీర్ణులు కావాలి.

ప్రశ్న: ప్రయివేటు కళాశాలలతో పోలిస్తే ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణతా శాతం తక్కువగా ఉన్న నేపథ్యంలో ఉత్తీర్ణత పెంచేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఆర్ఐఒ: అన్ని ప్రభుత్వ కళాశాలల్లో స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. అలాగే స్టడీ మెటీరియల్ కూడా ఉచితంగా ఇవ్వడం జరిగింది. గతంలో 9:30 నుంచి 4 గంటల వరకు ఉండే కళాశాల సమయాన్ని ఇప్పుడు 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మార్చారు.

ప్రశ్న: నీట్, జెఇఇ మెయిన్స్, అడ్వాన్స్, ఎంసెట్ వంటి పరీక్షలలో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు చాలా వెనుకబడి ఉంటున్నారు? దీనికి కారణం ఏమిటి? దీనిని అధిగమించేందుకు ఏమైనా చర్యలు తీసుకుంటున్నారా?

ఆర్ఐఒ: ప్రభుత్వ కళాశాలలు కేవలం ఇంటర్మీడియట్ విద్యలో మాత్రమే. అంటే ఇంటర్ సిలబస్ బోధించి ఇంటర్ పాస్ అయ్యేలా చూడటం వరకే మన అధ్యాపకుల బాధ్యత. ప్రయివేట్ కళాశాలల్లో నీట్, జెఇఇ వంటి వాటికి అదనంగా డబ్బులు కట్టించుకుని వాటికి ప్రత్యేక శిక్షణ ఇస్తారు. అదే ముఖ్యమైన తేడా... కాకపోతే ఇప్పుడు ప్రభుత్వ కళాశాలల్లో కూడా మెరిట్ స్టూడెంట్స్‌ను గుర్తించి విద్యా శక్తి పథకం ద్వారా జిల్లా కేంద్రంలో పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయడం జరుగుతుంది. వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారం వారం పరీక్షలు నిర్వహించడం జరుగుతుంది.

ప్రశ్న: ప్రయివేటు కళాశాలల్లో ఫీజుల దోపిడీపై అనేకసార్లు విద్యార్థులు, విద్యార్థి సంఘాలు ఆందోళన చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వ నియంత్రణ ఏమైనా ఉందా?

ఆర్ఐఒ: ప్రయివేటు కళాశాలల్లో ఫీజులపై ప్రభుత్వ నియంత్రణ లేదు. వారు కల్పించే సౌకర్యాలు, వారిచ్చే పుస్తకాలు, మెటీరియల్, నీట్, జెఇఇ కోచింగ్ వంటి అన్నింటికీ కలిపి ఫీజులు తీసుకుంటారు. ఇంత ఫీజు మాత్రమే వసూలు చేయాలి అనే నిబంధన లేదు. మరీ ఎక్కువగా వసూలు చేస్తున్నారని ఫిర్యాదు వస్తే చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: ప్రయివేటు కళాశాలల్లో సెలవు రోజుల్లో కూడా తరగతులు నిర్వహిస్తున్నారు. దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఆర్ఐఒ: అన్ని కళాశాలలకు సెలవు రోజుల్లో ఎలాంటి తరగతులు నిర్వహించకూడదని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చాం. ఎక్కడైనా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే వెంటనే చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: ప్రయివేటు కళాశాలల్లో విద్యార్థులపై తీవ్రమైన ఒత్తిడి ఉండటం వల్ల ఆత్మహత్యయత్నాలకు పాల్పడుతున్న నేపథ్యంలో మీరు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఆర్ఐఒ: ఆత్మహత్యల నివారణకు అనేక అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పోలీసు శాఖతో కలిసి అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. కళాశాలల్లో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేశాం. క్లబ్‌ల ద్వారా యాంటీ డ్రగ్స్, యాంటీ ర్యాగింగ్, ఆత్మహత్యల నివారణ పై వైద్యశాఖతో, పోలీసు శాఖతో సమన్వయం చేసుకొని ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించటం జరుగుతుంది.

ప్రశ్న. ఇంకా కొన్ని ప్రభుత్వ కళాశాలల్లో పుస్తకాలు ఇవ్వలేదని ఆరోపణలు వస్తున్నాయి. నిజమేనా?

ఆర్ఐఒ: అన్ని కళాశాలల్లో పుస్తకాలు ఇచ్చాం. అయితే కొన్ని కళాశాలల్లో అనుకున్న దానికంటే ఎక్కువ అడ్మిషన్లు రావడంతో పుస్తకాల కొరత కొంత వచ్చినప్పటికీ పది రోజుల క్రితం వారికీ అందజేశాం.

ప్రశ్న: జిల్లాలో ప్రయివేటు కళాశాలలు హాస్టళ్లు నిర్వహించేందుకు అనుమతులు ఉన్నాయా?

ఆర్ఐఒ: జిల్లాలో విద్యావికాస్, సిఆర్ఆర్, సెయింట్ థెరిస్సా కళాశాలలకు మాత్రమే హాస్టళ్ల నిర్వహణకు అనుమతులు ఉన్నాయి. మిగిలిన వారికి ఎలాంటి అనుమతులూ లేవు. ఎక్కడైనా నిర్వహిస్తున్నట్లు మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: జిల్లాలో అన్ని ప్రభుత్వ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం జరుగుతుందా? ఎంతమంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం తింటున్నారు?

ఆర్ఐఒ: జిల్లాలోని అన్ని ప్రభుత్వ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం నడుస్తోంది. దగ్గరలో ఉన్న హైస్కూళ్ల నుంచి భోజనం తయారు చేసి తీసుకొస్తున్నారు. నాలుగు వేల మంది విద్యార్థులు జిల్లాలో ప్రభుత్వ మధ్యాహ్న భోజనం పథకంలో తింటున్నారు.

ప్రశ్న: జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో నాడు–నేడు పనులు జరుగుతున్నాయా? అలాగే అధ్యాపకుల కొరత ఉందా?

ఆర్ఐఒ: ప్రస్తుతం నాడు–నేడు పనులు జరగడం లేదు. కొన్ని మధ్య దశలో, కొన్ని చివరి దశలో ఆగిపోయాయి. అధ్యాపకుల కొరత లేదు. జిల్లాలో 200 మంది రెగ్యులర్ అధ్యాపకులు, 200 మంది కాంట్రాక్టు అధ్యాపకులు, 30 మంది గెస్ట్ అధ్యాపకులు ఉన్నారు.

వికలాంగులకు మెరుగైన అవకాశాలు కల్పించాలి

పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

సమాజంలోని అందరితోపాటు వికలాంగులకు మెరుగైన అవకాశాలు కల్పించాలని కూటమి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు స్పష్టం చేశారు. పారా స్పోర్ట్స్‌ను ప్రోత్సహించాలనే లక్ష్యంతో విశాఖపట్నంలో 22 ఎకరాల్లో రూ.200 కోట్లతో స్టేడియం నిర్మాణానికి సిఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారన్నారు. స్థానిక ఎఎస్ఆర్ స్టేడియం వద్ద ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో ఏడో పారా స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటితో కలిసి కోటేశ్వరరావు ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ పారా స్పోర్ట్స్ లో రాణిస్తున్న వికలాంగులకు మూడు శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నారన్నారు. డిఎస్‌సిలో 15 మంది వికలాంగులకు కేవలం స్పోర్ట్స్ ఆధారంగా ఉద్యోగావకాశాలు కల్పించడం గర్వకారణమన్నారు. ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్క వికలాంగునికి పెన్షన్ అందజేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నో చర్యలు చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఇడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, మాజీ ఛైర్మన్ పూజారి నిరంజన్, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి రామస్వామి, జిల్లా అధ్యక్షులు చల్లా జాకబ్, వికలాంగుల సంక్షేమ శాఖ ఎడి రామకుమార్, గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ విశాలి, డిఎస్‌డిఒ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయునిగా అవకాశం దక్కించుకున్న బలగా గణేష్‌ను ఘనంగా సన్మానించారు.

PARA SPORTS ASSOCIATION OF ANDHRA PRADESH

పోటీలను ప్రారంభిస్తున్న ప్రముఖులు

18 నుంచి చెకుముకి సంబరాలు

ప్రజాశక్తి - ఏలూరు

ఈ నెల 18వ తేదీ నుంచి పాఠశాల స్థాయి చెకుముకి సంబరాల సైన్స్ టాలెంట్ టెస్ట్ ప్రారంభం అవుతుందని జన విజ్ఞాన వేదిక సభ్యులు తెలిపారు. మండల స్థాయి నవంబర్ ఒకటో తేదీన, జిల్లాస్థాయి పరీక్ష నవంబర్ 23వ తేదీన ఉంటుందని చెప్పారు. రాష్ట్రస్థాయి పరీక్ష డిసెంబర్ 12, 13, 14 తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ వారి అనుమతితో నిర్వహించుకుంటున్న సంబరాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మీ పాఠశాలల్లో 8, 9, 10, తరగతుల విద్యార్థులు ఎంతమంది రాయలనుకున్నా వివరాలను వాట్సాప్ ద్వారా గాని, ఫోన్ చేసి గాని తెలపాలని చెప్పారు. చెకుముకి ప్రశ్న పత్రాలు కావాల్సిన వారు 8247632961, 9989632961, 7093212999 సంప్రదించాలని తెలిపారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న మంత్రి పార్థసారధి

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

అధికారులకు రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి ఆదేశం

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని చింతలవల్లి గ్రామంలో పర్యటనలో భాగంగా ప్రజల నుంచి అర్జీలను తీసుకుని ఆ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సంబంధిత అధికారులను రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ఆదేశించారు. ఆదివారం చింతలవల్లి శివారు గోగులంపాడు గ్రామస్తులు పింఛన్లు, ఇళ్ల స్థలాలు, పొలం పాస్ పుస్తకాలు, గతంలో నిర్మించిన ఇళ్లకు బిల్లులు, రెవెన్యూ, విద్యుత్, తదితర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. మంత్రి వెంటనే సంబంధిత ప్రభుత్వ అధికారులతో సమస్యల గురించి ఫోన్లో మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వాటిలో 90 శాతం తక్షణమే పరిష్కారం చూపాలని, లేదా ఎన్ని రోజుల్లో ఆ సమస్యలను పరిష్కరిస్తారని ప్రజల ముందే అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు, ఎంపిటిసి మాజీ సభ్యులు మండవ బుజ్జియ్య, మేదరమెట్ల సురేంద్ర, మండలపు ధర్మరాజు, కొల్లి గంగారం, పాలడుగు చిన్ని, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

లారీ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - భీమడోలు

బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని వెనుక నుంచి లారీ ఢీ కొట్టడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఆగడాలలంక ఛానల్ రోడ్డుపై ఆదివారం చోటు చేసుకుంది. భీమడోలు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఆగడాలలంక గ్రామానికి చెందిన సిరంగి మోహనరావు(40) వ్యక్తిగత పనులపై ఆగడాల లంక నుంచి గుండుగొలను గ్రామానికి మోటారు సైకిల్‌పై బయలుదేరారు. వడ్డిగూడెం గ్రామ సమీపానికి వచ్చేసరికి బైక్‌పై ప్రయాణిస్తున్న మోహన్‌రావును ఆగడాల లంక నుంచి గుండుగొలను వైపు వస్తున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మోహన్‌రావు అక్కడికక్కడే మృతి చెందారు. భీమడోలు పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - మండవల్లి

ఘటనా స్థలంలో క్షతగాత్రుడు

కారు ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టిన ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ఘటన మండల కేంద్రమైన మండవల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అయ్యవారి రుద్రవరం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు బైక్‌పై మండవల్లి నుంచి కైకలూరు వైపు వెళ్తున్నారు. అదే సమయంలో కైకలూరు వైపు నుంచి మితిమీరని వేగంతో వస్తున్న కారు జిల్లా పరిషత్ హై స్కూల్ వద్ద బైక్‌ను బలంగా ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ముగ్గురు వ్యక్తులు గాయాలపాలయ్యారు. గమనించిన స్థానికులు ముగ్గురిని ఆటోలో కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు.

ఇంటి సరిహద్దు విషయమై వ్యక్తిపై దాడి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఇంటి సరిహద్దు విషయమై జరిగిన దాడిలో ఒక వ్యక్తి గాయపడిన సంఘటన మండలంలోని పెదపాలపర్రులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పెదపాలపర్రు గ్రామానికి చెందిన కొడాలి రమేష్‌కు రెండున్నర సెంట్ల డాబా ఇల్లు ఉంది. సరిహద్దుదారు కొడాలి శోభనాద్రికి పక్కనే కొంత స్థలం ఉంది. శోభనాద్రి తన స్థలంలో మెరక తోలగా సరిహద్దు రాళ్లు కప్పడిపోయాయి. దీంతో ఇరు గ్రూపులకు ఇంటి సరిహద్దు విషయమై ఈ నెల ఆరో తేదీ సాయంత్రం గొడవ జరిగింది. ఈ గొడవలో కొడాలి శోభనాద్రి, కష్టాల సతీష్, పెద బుజ్జి, స్వరూపరాణి, కొడాలి మణి అనే ఐదుగురు రమేష్ ఇంటి మీదకు వచ్చి రమేష్‌ను, అతని భార్యను బూతులు తిట్టి కింద పడవేసి కొట్టారు. సతీష్ కత్తిలాంటి దానితో రమేష్‌ను కొట్టగా నుదుటి మీద, ఎడమ చేతి మణికట్టు వద్ద రక్త గాయాలయ్యాయి. అడ్డు వచ్చిన రమేష్ భార్యపై రాళ్లతో దాడి చేశారు. భార్య కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి విడదీశారు. దీంతో గాయపడిన రమేష్‌ను చికిత్స నిమిత్తం గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి శనివారం రాత్రి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం అక్రమ విక్రయం

వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - చింతలపూడి

అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. చింతలపూడి ఎక్సైజ్ సిఐ పి.అశోక్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ పరిధి మండలంలోని పొనుకుమాడు గ్రామంలో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో పొనుకుమాడు గ్రామానికి చెందిన గంగుల తిరుపతయ్యను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి ఏడు మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు అశోక్‌కుమార్ తెలిపారు. ఈ దాడుల్లో చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ ఎస్ఐ జె.జగ్గారావు, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

9 మంది అరెస్టు

ప్రజాశక్తి - చింతలపూడి

పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. చింతలపూడి సిఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు లింగపాలెం మండలం ధర్మాజీగూడెం గ్రామ శివారులో పేకాట స్థావరంపై ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.14,900 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు. ఈ దాడిలో ఎస్ఐ వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు పట్టాలపై గుర్తు తెలీని మృతదేహం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఏలూరు నగరంలోని వట్లూరు సమీపంలో ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు నగరంలోని వట్లూరు రైల్వే వంతెన సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి రైలు ప్రమాదంలో మృతి చెంది ఉన్నాడన్న సమాచారాన్ని రైల్వే పోలీసులు అందుకున్నారు. వెంటనే రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతుని వద్ద ఎటువంటి వివరాలు లభించలేదు. మృతుడు 5.5 అడుగుల ఎత్తు ఉండి చామన ఛాయా రంగు కలిగి ఉన్నాడని, తెలుపు, నలుపు చారల చొక్కా, బిస్కెట్ రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. వయసు 35 నుంచి 40 సంవత్సరాలు మధ్య ఉంటుందని రైల్వే పోలీసులు తెలిపారు. వివరాలు తెలిసినవారు రైల్వే పోలీసులను సంప్రదించాలని చెప్పారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి

- ☐ రైతుల కోసం ప్రత్యేక ఫీడర్లు ఏర్పాటు
- ☐ ఏమైనా సమస్యలుంటే తెలియజేయండి
- ☐ విద్యుత్ శాఖ జంగారెడ్డిగూడెం డివిజన్ ఎఇ పీర్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ప్రతి వినియోగదారునికి నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడం మా ప్రధాన లక్ష్యమని విద్యుత్ శాఖ జంగారెడ్డిగూడెం డివిజన్ ఎఇ పీర్ అహ్మద్‌ఖాన్ అన్నారు. రైతులు కోసం ప్రత్యేక ఫీడర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. వినియోగదారులు సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో ముచ్చటించారు.

ప్రశ్న: డివిజన్ పరిధిలో ఎన్ని మండలాలు ఉన్నాయి?

అధికారి : డివిజన్ పరిధిలో మొత్తం పది మండలాలు ఉన్నాయి. ప్రతి మండలంలో లైన్‌మెన్, సబ్‌స్టేషన్లు, ఫీల్డ్ స్టాఫ్ కలిసి సమర్థవంతంగా పని చేస్తున్నారు.

ప్రశ్న : ప్రస్తుతం విద్యుత్ సరఫరా పరిస్థితి ఎలా ఉంది?

అధికారి : మేజర్ సమస్యలు లేవు. వర్షాకాలంలో చెట్లు కూలడం, లైన్లు తెగిపోవడం వంటి ఇబ్బందులు వస్తే వెంటనే మా టీమ్‌లు స్పందించి పరిష్కరిస్తున్నాయి.

ప్రశ్న : వినియోగదారులు ఎక్కువగా ఏ సమస్యలు చెబుతున్నారు?

అధికారి : ప్రధానంగా బిల్లింగ్, కొత్త కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం పెంపు వంటి అభ్యర్థనలు వస్తుంటాయి. వాటిని నిర్ణీత గడువులో పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న : డివిజన్‌లో కొత్త అభివృద్ధి పనులు ఏమైనా జరుగుతున్నాయా?

అధికారి : అవును. పలు సబ్‌స్టేషన్ల అప్‌గ్రేడేషన్ పనులు జరుగుతున్నాయి. కొత్త లైన్లు, అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తూ భవిష్యత్తులో లోడును తట్టుకునేలా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న : రైతులకు ఉచిత విద్యుత్ సరఫరా ఏ విధంగా ఉంది?

అధికారి : రైతుల కోసం ప్రత్యేక ఫీడర్లు ఏర్పాటు చేశారు. నిరంతరాయంగా సరఫరా అందించడానికి మా సిబ్బంది కృషి చేస్తున్నారు.

ప్రశ్న : ఇటీవల కాలంలో పామాయిల్ తోటల్లో విద్యుదాఘాతానికి గురై కొంతమంది చనిపోయారు. దీనిపై మీరు రైతులకు ఎటువంటి సూచనలు ఇస్తున్నారు?

అధికారి : రైతులందరికీ అలాగే పామాయిల్ గెలలు కోసే కార్మికులకు ఒకటే చెబుతున్నా. విద్యుత్ సరఫరా సమయంలో మీరు కరెంటు తీగలకు దగ్గరగా ఉన్న చెట్లను ముట్టుకోవద్దు. ప్రాణం చాలా విలువైంది. అది పోతే తిరిగి రాదు. కరెంటు తీగలు చెట్లకు దగ్గరగా ఉంటే ఎల్‌సి తీసుకొని పని చేసుకోండి. మీ పొలాల్లో ఏమైనా కరెంటు సమస్యలు ఉంటే వెంటనే మాకు తెలియజేస్తే మేము సరి చేస్తాం.

ప్రశ్న : సోలార్ వల్ల ప్రజలకు ఏమైనా ఉపయోగం ఉందా?

అధికారి : సోలార్ పెట్టుకునేవారికి మూడు కిలో వాట్స్‌కు రూ.2.10 లక్షలు ఆదా అవుతుంది. దానిలో రాయితీ రూ.78 వేలు ప్రభుత్వం ఇస్తుంది. అలాగే ఎస్‌సి, ఎస్‌టి వారికి రెండు కిలో వాట్స్‌కు వారి ఇంటిపై ఉచితంగా సోలార్లు నిర్మించి ప్రభుత్వమే వారికి తిరిగి నెలకు రూ.200 వారి ఖాతాలో జమ చేస్తుంది. మొత్తం డివిజన్‌లో 48 వేల మంది ఎస్‌సి, ఎస్‌టి సోలార్ అర్హులు ఉన్నారు. దానిలో 17,091 మంది వారి గృహాలపై పైకప్పు ఉన్నవారు ఉన్నారు. 6,731 మంది ప్రస్తుతం సోలార్ పెట్టించుకోవడం సమ్మతమేనని తెలిపారు. సోలార్ వల్ల ప్రజలకు ఉపయోగమే తప్ప నష్టమేమీ లేదు. అందరూ గమనించి సోలార్‌ను వినియోగించుకోండి.

ప్రశ్న : స్మార్ట్ మీటర్స్ వల్ల ప్రజలకు ఏమైనా ఇబ్బంది ఉందా?

అధికారి : స్మార్ట్ మీటర్లపై ప్రజలు అపోహలు పెట్టుకోవద్దు. ఇప్పటికే డివిజన్‌లో కేటగిరి-2 మీటర్స్ ఉన్నవారికి, పరిశ్రమలకు, షాపులకు ఈ స్మార్ట్ మీటర్లు బిగించాం. గతంలో కరెంటు బిల్లులు ఎలా అయితే వచ్చాయో అలాగే వస్తాయి. దీనిపై ఎటువంటి అపోహ పడొద్దు. ప్రజలు కీప్యాడ్ ఫోన్ నుంచి స్మార్ట్ ఫోన్‌కు ఎలా అయితే వచ్చారో అలాగే స్మార్ట్ మీటర్లు కూడా. దీనివల్ల ఎటువంటి నష్టం లేదు.

ప్రశ్న: మీ డివిజన్ లక్ష్యం ఏమిటి?

అధికారి : ప్రతి వినియోగదారునికి నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడం మా ప్రధాన లక్ష్యం.

రైతులు ఐకమత్యంగా ఉండాలి

పంట మద్దతు ధర కోసం పోరాడాలి

రైతు సంఘం మండల కార్యదర్శి సిహెచ్.శ్రీనివాస్

ప్రజాశక్తి - ముసునూరు

రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలంటే రైతులందరూ ఐకమత్యంగా ఉండాలని రైతు సంఘం మండల కార్యదర్శి సిహెచ్.శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రమైన ముసునూరులోని సిపిఎం కార్యాలయంలో సిఐటియు జిల్లా నాయకులు జి.రాజు ఆధ్వర్యంలో రైతు సంఘం మండల మహాసభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జి.రాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకొచ్చినప్పటి నుంచి నేటి వరకు రైతుకు ఎటువంటి లాభం చేకూర్చలేదన్నారు. రైతు పండించిన పంట రేటు నిర్ణయించినప్పుడే నిజమైన స్వతంత్రం వచ్చినట్లని అన్నారు. అలాగే మండలంలోని 16 గ్రామాల్లో అధికంగా పండించే మొక్కజొన్న పంట దళారీ వ్యవస్థగా మారిందన్నారు. ఎకరానికి ఎన్ని టన్నులు మొక్కజొన్న పంట దిగుబడి వస్తుందనేది ఏ కంపెనీ కూడా ముందుగానే డిమాండ్ బాండ్ రాసిచ్చే కంపెనీలు ఇప్పటివరకు లేవన్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖాధికారులు కూడా దళారులకు అండగా నిలుస్తున్నారే తప్ప, రైతు పక్షాన నిలబడటం లేదన్నారు. రైతులు పండించిన పంటలు దిగుబడి తగ్గినా కనీసం పెట్టిన పెట్టుబడి రాక కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు మండలంలో అనేకం చోటు చేసుకున్నాయన్నారు. వారికి సిపిఎం అండగా నిలిచిందన్నారు. రైతు సంఘంలోని రైతులందరూ ఆయా గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించి నష్టపోకుండా చూడాలని చెప్పారు. అనంతరం రైతు సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షులుగా చల్లపల్లి శ్రీను, కార్యదర్శిగా సిహెచ్.శ్రీనివాస్, కమిటీ సభ్యులుగా కె.వీరవెంకయ్య, కొండిబోయిన గంగరాజు, చింతా రంగారావు, సూరిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రైతు సంఘం నూతన కమిటీ సభ్యులందరూ కలిసి తీర్మానం ఆమోదం తెలిపారు. కౌలు రైతులందరికీ కౌలు కార్డు ఇచ్చి నష్టపోయిన వారిని రాష్ట్రప్రభుత్వం ఆదుకోవాలని, పంట రేటు నిర్ణయించేలా ప్రభుత్వాలు చట్టాలు తీసుకురావాలని, గిట్టుబాటు ధర కల్పించాలని, వ్యవసాయ సాగులో యంత్రాలు తగ్గించి రైతుల ద్వారా పంటలు పండించే విధంగా రాయితీలు అందించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు కొడవలి శ్రీనివాస్, పోటురు శ్రీను, కంచర్ల శ్రీను, కంచర్ల రామారావు, కంచర్ల దుర్గారావు, పోతురాజు, చలపాటి ప్రసాద్‌రావు, పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నేతలు

ఆత్మ రక్షణకు కరాటే దోహదం

ఏలూరు ఎంఎల్ఏ బడేటి రాధాకృష్ణయ్య (చంటి)

కరాటే ఛాంపియన్ షిప్-2025 బడేటి కప్పు పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

యువత ఆత్మ రక్షణకు కరాటే ఎంతగానో దోహదపడుతుందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి చెప్పారు. యువతకు కరాటేలో శిక్షణ ఇచ్చేందుకు అంకితభావంతో కృషి చేస్తున్న శిక్షకులు ఇబ్రహీం బేగ్, డిఎల్.నారాయణను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. సర్ సిఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల జిమ్‌లో ఆలిండియా షోటోకాన్ కరాటే ఛాంపియన్ షిప్-2025 బడేటి కప్పు పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా ప్రతి ఏడాది ఈ ఛాంపియన్ షిప్ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఏడు రాష్ట్రాల నుంచి దాదాపు 850 మంది యువతీ యువకులు ఈ పోటీల్లో పాల్గొనడం ఏలూరుకే గర్వకారణమన్నారు. రోజురోజుకు కరాటే పట్ల యువతలో ఆసక్తి పెరుగుతోందని, కరాటే వల్ల మానసిక ఆరోగ్యం కూడా కలుగుతుందని చెప్పారు. ఎంతో ప్రాచీనమైన కరాటేకు ఆదరణ తగ్గకుండా, ఎంతో మందికి శిక్షణ ఇస్తున్న ఇబ్రహీం బేగ్, డిఎల్.నారాయణ అభినందనీయులని ఎంఎల్ఎ కితాబు ఇచ్చారు. వారికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ ఛాంపియన్ షిప్‌నకు బడేటి కప్పు పేరిట స్పాన్సర్ షిప్ చేయటం ఎంతో సంతోషం కలిగిస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొంటున్న ప్రతిఒక్కరికీ ఆయన అభినందనలు తెలిపారు.

ALL INDIA SHOTOKAN
KARATE
CHAMPIONSHIP
SIR C.R.REDDY
DEPARTMENT
SOUTH ZONE

మాట్లాడుతున్న ఎంఎల్ఏ బడేటి చంటి

ఈ కార్యక్రమంలో ఇడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, మాజీ ఛైర్మన్ పూజారి నిరంజన్, ఏలూరు అగ్రికల్చర్ సొసైటీ బ్యాంకు ఛైర్మన్ అమరావతి అశోక్, ఎకెఎఫ్ జడ్జిలు ఇబ్రహీం బేగ్, డిఎల్.నారాయణ, కరాటే అసోసియేషన్ కార్యదర్శి నాగం శివ, ఆర్గనైజింగ్ సెక్రటరీ కవులూరి చంద్రశేఖర్, న్యాయవాది కొల్లు శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ సంజీవ్ పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్

శక్తి యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లా వ్యాప్తంగా ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం, పోలవరం సబ్ డివిజన్ల పరిధిలో ఆదివారం సాయంత్రం శక్తి టీమ్ సభ్యులు విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారని ఏలూరు శక్తి టీమ్ ఇన్‌ఛార్జి సిఐ సుబ్బారావు తెలిపారు. మహిళల భద్రత కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన శక్తి యాప్‌పై పూర్తిస్థాయి అవగాహన కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా శక్తి టీమ్ సభ్యులు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఆదివారం సాయంత్రం జిల్లాలోని నాలుగు సబ్ డివిజన్ల పరిధిలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. స్థానికంగా ఉన్న కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. విద్యార్థినిలు ఆండ్రాయిడ్ ఫోన్లు వినియోగిస్తున్నట్లయితే ఆ ఫోన్‌లో శక్తి యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవడం ద్వారా అత్యవసర సమయాల్లో పోలీసుల సహాయం పొందవచ్చని తెలిపారు. అంతేకాకుండా 112 నెంబర్ ఆవశ్యకతను వారికి వివరించారు. మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ 181 వినియోగించుకోవాలని సూచించారు. అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్ డివిజన్ల పరిధిలో పనిచేస్తున్న శక్తి టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

పోలీసింగ్ చేస్తున్న శక్తి టీమ్ సభ్యులు

వికలాంగులకు కృత్రిమ కాలు స్క్రీనింగ్ శిబిరం

62 మంది ఎంపిక

వారికి 15 రోజుల్లో కృత్రిమ కాళ్లు అందజేత

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం ఏజెన్సీ లయన్స్ క్లబ్, ఏలూరు హేలాపురి లయన్స్ క్లబ్ వారు సంయుక్తంగా వికలాంగుల కృత్రిమ కాలు స్క్రీనింగ్ శిబిరం జంగారెడ్డిగూడెం లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రం మొత్తంలో 62 మంది వికలాంగులు ఎంపికయ్యారు. 20 మంది వరకు ఎంపిక కాలేదు. తర్వాత జరిగే కార్యక్రమానికి రావాలని చెప్పారు. ఎంపికైన వికలాంగులకు 15 రోజుల్లో కృత్రిమ కాళ్లు అందించనున్నారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ఏజెన్సీ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ దాసరి శేషు కుమార్, కొండపల్లి పండు, మద్దిపాటి నాగేశ్వరరావు, కన్నా హనుమంతరావు, అట్లూరి సురేష్, పంతగాని వెంకన్న, కోటేశ్వరరావు, ఖండవల్లి ఆశీర్వాదం, మేడిచర్ల రవి, ఏలూరు లయన్స్ క్లబ్ సభ్యులు లయన్ కెబి.రావు, కోర్సు శ్రీనివాస్, చలసాని అరుణ్ కుమార్, దేవినేని రమాదేవి, సరస్వతి, వాణి, కణాల లక్ష్మీకుమారి, ఖమ్మం రోటరీ క్లబ్ సభ్యులు రంగారావు, సాంబశివరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కృత్రిమ కాలు స్క్రీనింగ్ శిబిరంలో వికలాంగులు

నియోజకవర్గ సమన్వయకర్తగా తెల్లం బాలరాజు

వైసిపి శ్రేణుల హర్షం

ప్రజాశక్తి - టి.నరసాపురం

వైసిపి పోలవరం నియోజకవర్గ వైసిపి సమన్వయకర్తగా మాజీ ఎంఎల్ఎ తెల్లం బాలరాజును పార్టీ అధినేత వైఎస్.జగన్మోహన్ రెడ్డి నియమించడంపై వైసిపి మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక సొసైటీ మాజీ ఛైర్మన్ దేవరపల్లి ముత్తయ్య నివాస గృహం వద్ద ఆదివారం సాయంత్రం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి మండల కన్వీనర్ ఎస్‌విపికెహెచ్.శ్రీనురాజు మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గ సమన్వయకర్త బాలరాజు నియామకంతో పార్టీ బలోపేతం అవుతుందని తెలిపారు. పార్టీ పిలుపుమేరకు అన్ని పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని పార్టీ అభివృద్ధికి కషి చేస్తామన్నారు. నియోజకవర్గంలో పార్టీ పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు అహర్నిశలు కృషి చేయడానికి కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారన్నారు. గ్రామాల్లో పార్టీ బలోపేతానికి ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో రైతు విభాగం జిల్లా అధ్యక్షులు వాసిరెడ్డి మధు, కాల్నీడి సుబ్బారావు, ఎంపిటిసి సభ్యులు నార్లపాటి వెంకట్రావు, నాయకులు ఒంటిపల్లి సుబ్రహ్మణ్యం, కటకం మల్లికార్జునరావు, సీతారాం ప్రసాద్ మాదంశెట్టి మల్లయ్య, నల్లూరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'కూటమిలో కష్టపడినవారికి గుర్తింపు'

ప్రజాశక్తి - చింతలపూడి

టిడిపి కూటమి ప్రభుత్వంలో కష్టపడిన ప్రతిఒక్కరికీ గుర్తింపు ఉంటుందని, న్యాయం జరుగుతుందని శ్రీ కాళహస్తి దేవస్థానం పాలకమండలి సభ్యులు నాగరాజు అన్నారు. మండలంలోని పోనుకుమాడు గ్రామంలో శ్రీ కాళహస్తి దేవస్థానం పాలకమండలి సభ్యులు ఎన్నికైనందుకు టిడిపి ప్రగడవరం గ్రామ నాయకులు బేతి మహాలక్ష్ముడు, మానేపల్లి రాజారావు, సరిపల్లి వెంకటేశ్వరరావు, సరిపల్లి కిరణ్, రాంబాబు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి ఇచ్చినందుకు ఎంపీకి, ఎంఎల్‌ఏకు కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. రానున్న రోజుల్లో తన వంతుగా పార్టీ కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సులకు క్లీనర్లను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ప్రయివేట్ పాఠశాలల బస్సుల్లో క్లీనర్లను ఏర్పాటు చేయాలని సిపిఐ మండల కార్యదర్శి తాడిగడప అంజనేయరాజు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులను పాఠశాలలకు తీసుకెళ్లి తీసుకొచ్చే బస్సుల్లో డ్రైవర్లు తప్ప క్లీనర్లు ఉండటం లేదని తెలిపారు. దీంతో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. బస్సుల్లో కూడా ఎక్కువమంది విద్యార్థులను కిక్కిరిసే విధంగా ఎక్కించుకుని బస్సులు నడుపుతున్నారని తెలిపారు. పరిమితికి మించి విద్యార్థులను బస్సుల్లో తీసుకువెళ్తున్నారని పేర్కొన్నారు. సంబంధిత విద్యాశాఖాధికారులు, మోటార్ వెహికల్స్ అధికారులు ఈ విషయంపై తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

పల్లెల అభివృద్ధే కూటమి లక్ష్యం

ప్రజాశక్తి - మండవల్లి

పల్లెలను అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కైకలూరు ఎంఎల్‌ఎ, గవర్నమెంట్ అస్యూరెన్స్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ కామినేని శ్రీనివాస్ స్పష్టం చేశారు. మండవల్లి మండలంలోని పసరుపూడి గ్రామంలో పిఎంజిఎస్‌వై నిధులు రూ.మూడు కోట్లతో నిర్మించిన జిఆర్ రోడ్డును నాయకులతో కలిసి ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెలు అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రహదారులపై దృష్టి సారించిందన్నారు. నిధులను కేటాయించి గ్రామస్థాయి నుంచి రహదారులను నిర్మించే విధంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పుడు నిర్మించిన రోడ్డుతో చింతలపూడి నుండి గున్నవపూడి, కొమ్మలపూడి, పసలపూడి మీదుగా లేళ్లపూడి వెళ్లేందుకు ప్రజలకు ప్రయాణం సుఖంగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చాపరాల దుర్గాప్రసాద్, సజ్జా బాబి, ప్రజా ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు నూలి వెంకట నారాయణరావు అనే నూలి శ్రీనివాస్ ఇచ్చిన సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియచేయునది ఏమనగా, నా క్లయింట్ ది. 08-10-2025 న తేదిన నరసాపురంలో చెందిన కోట్ల సాయి వెంకట రాజా వార్త పత్రికలో ఇచ్చిన ప్రకటనకు బదులుగా తెలియచేయు విషయములు ఏమనగా కోట్ల సాయి వెంకట రాజా, నరసాపురం వారికిన్నీ మా క్లయింటునకు ఆర్థిక లావాదేవీలు జరుగుట ఉన్నవి. సదరు కోట్ల సాయి వెంకట రాజా మా క్లయింటుకు బాకీ పడగా దానిలో కొంత బాకీ వసూలు నిమిత్తం [illegible] గల ఒక అపార్టుమెంటులో ఇంకా కన్‌స్ట్రక్షన్‌లో ఉన్న ఫ్లాట్‌ను నా క్లయింట్ భార్య అయిన నూలి గంగా భవాని గారి పేరున క్రయ దస్తావేజు వ్రాసి ఇచ్చినారు. అలాగే నిలిచి ఉన్న మిగతా బాకీ నిమిత్తం డాక్యుమెంట్ నెం. 3720/2019, తేది. 04-07-2019 ఈ యొక్క డాక్యుమెంటు లింక్ మరియు పట్టాదారు పాస్ పుస్తకము సెక్యూరిటీగా ఇచ్చియున్నారు. ఈ యొక్క బాకీలు [illegible] విధంగా ది. 08-10-2025 న పైన పేర్కొనబడిన డాక్యుమెంట్ [illegible] అని ప్రకటన ఇచ్చినారు. గాన సదరు ప్రకటన చెల్లదు అని దానిలో పేర్కొనబడిన విషయాలు అన్నీ అవాస్తవాలు అని ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది. సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకొనబడునని తెలియజేయడమైనది.

ఇట్లు
అమరేశ్వరరావు. కె
అడ్వకేట్, నరసాపురం
సెల్: 90637 77879

నరసాపురం
ది.12-10-2025

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో పాలకొల్లు

O.S.No.122/2023

Between:

పీతాని వెంకటేశ్వరరావు ...వాది

Vs

పీతాని పుష్పావతి వగైరా ...ప్రతివాదులు

D1: పీతాని పుష్పావతి
W/o. నాగేశ్వరరావు (Late), D.No: 4-24, కొంతేరు, యలమంచిలి మండలం, W.G.Dt, NJCJC

D2: పీతాని శ్రీనివాస్ S/o. లచ్చన్న (Late), D.No: 4-24, కొంతేరు, యలమంచిలి మండలం, W.G.Dt, NJCJC

D3: పీతాని సుబ్బారావు
S/o. సుబ్బారావు (Late), వెజిటేబుల్ మార్కెట్ వద్ద, దొంగరావిపాలెం, పెనుగొండ మండలం, W.G.Dt, TJCJC

పై నెంబరు గ్రంథంలో 1 to 3 ప్రతివాదులు శ్రీ కోర్టు వారి ఆదేశానుసారం పలుమార్లు శ్రీ కోర్టు వారి ద్వారా మరియు రిజిష్టరు పోస్టు ద్వారా సమన్లు జారీ చేసినను, వారు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనకపోయేందున శ్రీ కోర్టు ఈ పత్రికాముఖంగా సమన్లు జారీ ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున ప్రతివాదులు ది. **14-10-2025 తేదిన ఉదయం గం. 10:30 నిలకు** శ్రీ కోర్టు వారి ఎదుట ప్రత్యక్షంగా గాని, లేదా తమ న్యాయవాది ద్వారా గాని హాజరై సదరు గ్రంథమునందు మీ ఆక్షేపణలు తెలియచేయవలెను. లేనియెడల సదరు దావా గ్రంథం మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియచేయడమైనది.

(కోర్టు వారి ఆదేశానుసారం)

బొంతు నాగభూషణరావు (గాంధీ) బొంతు ప్రతిభ
అడ్వకేట్స్, పాలకొల్లు
సెల్: 98495 92095

పాలకొల్లు
ది. 12-10-2025